


దర్శనానికి వెళ్లివస్తూ...

భాకరాపేట ఘాట్‌లో ముగ్గురు దుర్మరణం

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం భాకరాపేట ఘాట్‌లో టమోటా లోడ్‌తో కలకడ నుంచి చెన్నయ్ వెళుతున్న కంటైనర్ మలుపు వద్ద అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారుపై బోల్తా పడింది. ఈ ఘటనలో చిక్‌బల్లాపూర్‌కు చెందిన నలుగురిలో రమేష్ మూర్తి (34), హెచ్‌కె మంజునాథ (38), హెచ్.ముని వెంకటరెడ్డి (55)లు ముగ్గురూ అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి తేజస్‌కుమార్ (33), తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లాకు చెందిన కంటైనర్ డ్రైవర్ అల్లావుద్దీన్ (30)లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎస్‌పి సుబ్బరాయుడు పరిశీలించారు.

(వార్త జనరల్‌లో..)



దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా భాకరాపేట ఘాట్‌లో ముగ్గుర్ని బలి తీసుకున్న టమోటా లోడ్ కంటైనర్

అమరరహే..!



ఏచూరికి అశ్రునివాళి

ఉమ్మడి చిత్తూరు జిల్లాతో అనుబంధం

'ప్రజాశక్తి' తిరుపతి ఎడిషన్ ప్రారంభోత్సవంలోనూ..

వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణుల నివాళి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, యంత్రాంగం

'సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఇకలేరు' అన్నది నమ్మలేని నిజం.. అయినా నమ్మక తప్పని వాస్తవం. శ్వాసకోశ సంబంధిత ఇన్‌ఫెక్షన్‌తో గత కొంతకాలంగా ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన గురువారం మధ్యాహ్నం మృతిచెందడం సిపిఎం శ్రేణులను దిగ్భ్రాంతి కలిగించింది. సీతారాం ఏచూరికి ఉమ్మడి చిత్తూరు జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. ముఖ్యంగా 'ప్రజాశక్తి' తిరుపతి ఎడిషన్‌ను ప్రారంభించిన సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేశారు. 'ప్రజాశక్తి' పేదల పత్రిక అని కీర్తించారు. ఏచూరి మరణానికి సంతాపంగా పార్టీ కార్యాలయాల వద్ద జెండాను మూడు రోజుల పాటు అవనతం చేసినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలిపారు.

పేదల ఆయుధం ప్రజాశక్తి : ఏచూరి

దళిత పీడిత ప్రజల కోసం ప్రజాశక్తి ఉందని, ప్రతి పేదవాని ఆయుధం ప్రజాశక్తి అని సిపిఎం జాతీయ నేత సీతారాం ఏచూరి అన్నారు. హైదరాబాద్, విజయవాడ,



'ప్రజాశక్తి' తిరుపతి ఎడిషన్ ప్రారంభోత్సవంలో..

విశాఖపట్నం తరువాత 2001, ఆగస్టులో తిరుపతి ఎడిషన్ ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. టిటిడిలో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులు, ఇక్కడి పేదల సమస్యలపై ఇక్కడి 'ప్రజాశక్తి' లోతుగా విశ్లేషించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి కథనాలను ఇవ్వాలని సూచించారు. అప్పటి సమాచార శాఖ మంత్రి డాక్టర్ శివప్రసాద్ ఎడిషన్ కార్యాలయాన్ని ప్రారంభించగా, సుందరయ్య తొలుత తీసుకొచ్చిన పేపర్ ప్రింటింగ్ యంత్రాన్ని ఏచూరి ప్రారంభించారు.

– ఎన్‌సిఎ, సిసిఎ చట్టాలకు వ్యతిరేకంగా తిరుపతిలో పాల్గొని బిజెపి మతతత్వాన్ని, ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ దేశానికి వినాశక మతతత్వ విధానాలను బిజెపి తీసుకొస్తుందని,



పౌరసత్వ సభలో...

హిందూ ముస్లీం కలయికను దెబ్బతీసే కుట్ర పన్నుతుందని, అందరూ ఐక్యంగా కులమతాలకు అతీతంగా బిజెపి చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు.

– 2013, ఏప్రిల్ 28న తిరుపతి ఎస్‌వి హైస్కూల్లో జరిగిన ఉమ్మడి రాష్ట్ర యుటిఎఫ్ కార్యవర్గ సమావేశాలు మూడు రోజుల పాటు జరిగాయి. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రతి పేదవానికి విద్య అందించాలని పుస్తకాన్ని విడుదల చేశారు.

– 1992లో యూనివర్సిటీ విద్యార్థుల సమస్యలపై రాష్ట్రస్థాయి సదస్సు ఎస్వీయూ ఆడిటోరియంలో జరిగింది. ఎస్ఎఫ్ఐ జాతీయ స్థాయి హోదాలో అప్పట్లో హాజరయ్యారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏ విధంగా పోరాడాలన్నది దిశానిర్దేశం చేశారు. అప్పటి వీసీ రామ్మూర్తితో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.



యుటిఎఫ్ నాయకులతో..



తిరుపతిలో నివాళి అర్పిస్తున్న వందవాసి నాగరాజు

సమాజానికి తీరని లోటు : సిపిఎం

తిరుపతి సిటి : భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం సమాజానికి తీరని లోటని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. తిరుపతి యశోదనగర్‌లోని ఎంబి భవన్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆద్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ గురువారం సాయంత్రం జరిగింది. చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించి, జోహార్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఎస్‌వియులో ఏచూరి తెలుగు ఉపన్యాసాలను విద్యార్థులు వినయంగా ఆలకించేవారనే, అంతటి వాగ్ధాటి అని ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకుని దుంఖించారు. భారత రాజకీయాల్లో ఆయన తనదైన ముద్రవేశారన్నారు. కమ్యూనిస్టు పార్టీని సిద్ధాంతపరంగా నడిపించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. మతోన్మాదాన్ని ఎదుర్కొవడంలో ఆయన పాత్ర ఎనలేనిదన్నారు. 1992లో చెన్నయ్‌లో జరిగిన జాతీయ మహాసభల్లో రష్యా కమ్యూనిస్టు పరిస్థితులపై, అప్పటి రాజకీయ విషయాలపై మూడు రోజుల పాటు నిద్రాహారాలు మాని డాక్యూమెంటరీ తయారు చేసిన అకుంఠిత దీక్ష పరుడని కొనియాడారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ మాట్లాడుతూ మహోన్నత, వైవిద్యమైన వ్యక్తుల మృతి సమాజానికి తీరని లోటని తెలిపారు. పార్టీ కార్యాలయం నుంచి ఇంటికి వెళ్లుతూ సాదారణ వైద్య పరీక్షల కోసం ఆగస్టు 22న ఆసుపత్రికి వెళ్లిన ఆయనకు రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించి మృతి చెందడం బాధాకరం అన్నారు. ఏచూరి తిరుపతిలో అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. సిపిఐ రాష్ట్ర నాయకులు చిన్నం పెంచులయ్య మాట్లాడుతూ దేశం మొత్తం నేడు ఏచూరివైపు చూస్తోందన్నారు. ఓ మహా యోదుడు, వామపక్ష మహా వృక్షం కూలిపోవడం పట్ల బాధపడుతున్నారని తెలిపారు. రిపబ్లికన్‌పార్టీ దక్షణభారత అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు నాయకుడిగా ప్రపంచాన్ని శాసించేస్థాయికి ఏచూరి ఎదిగారని తెలిపారు. 1992 తిరుపతికి వచ్చిన ఏచూరి, తిరిగి 2002లో పాత మునిసిపల్ కార్యాలయంలోని నెహ్రూలలిత కళాప్రాంగాణంలో రిజర్వేషన్లపై జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేశారని, 2022 మార్చి 8న మహిళా దినోత్సవం రోజు ఆర్‌డివో కార్యాలయం వద్ద జరిగిన పౌరసత్వ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసి తిరుపతిలోని వేలాది మందిని చైతన్య పరిచారని గుర్తు చేశారు. సిటికేబుల్ న్యూస్ జిఎం రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజల మేలుకోరే వ్యక్తి ఏచూరి అని, ఆయన అత్యంత సాదారణ జీవితం గడిపేవారని, గతంలో ఆయనతో కలిసి ముఖా ముఖి కార్యాక్రమాన్ని నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిలక్ష్మీ, హేమలత, గోల్కొండ వెంకటేశం, నాగార్జున, జయచంద్ర, బుజ్జమ్మ, సుబ్రమణ్యం, వేణుగోపాల్ పాల్గొన్నారు.

చంద్రగిరిలో... మండల కమిటీ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేశారన్నారు. నాయకులు జయచంద్ర, వాణిశ్రీ, నాగ వెంకటేష్, చిన్నబాబు, నాగభూషణమ్మ, మునిరాజమ్మ, పావని, యుగంధర్ పాల్గొన్నారు.

- కెవిబిపురంలో సిపిఎం మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఏచూరి ఉద్యమాల పరంపరను శ్రేణులకు వివరించారు. వెంకటేశ్వర్లు, దేశమ్మ, చంద్రయ్య, కళావతి, వీరమ్మ, జ్ఞానమ్మ పాల్గొన్నారు.

- పుత్తూరులో సిపిఎం నాయకులు వెంకటేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

- సత్యవేడు సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కృష్ణయ్య, మునస్వామి, తిరుపాల్‌రెడ్డి, సుశీల, జయలక్ష్మి, పోలమ్మ పాల్గొన్నారు.

గూడూరులో... సిపిఎం నాయకులు జోగి శివకుమార్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. పుట్ట శంకరయ్య, వెంకట రామిరెడ్డి, పామాంజి మణి, సురేష్ పాల్గొన్నారు.

రేణిగుంటలో ఒ.వెంకటరమణ, శివానందం, సత్యశ్రీ, హరి తదితరులు పాల్గొన్నారు.

బొజ్జల సంతాపం

శ్రీకాళహస్తి : జాతీయ రాజకీయాల్లోనే అజాతశత్రువు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని తెలుగుదేశం పార్టీ శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. అందరు బావుండాలని, అందర్ని కలుపుకుని పోవాలనే ఆలోచనలతో వామపక్ష ఉద్యమాల్లో ఆయనో కొత్తపంథాను తీసుకుని వచ్చారన్నారు. సైద్ధాంతిక విబేధాలున్న వారితోనూ ప్రజల అవసరాల కోసం కలసి బలమైన పోరాటాలు నిర్మించారని, వాటిని విపక్షాల ఐక్యతకు పునాదులుగా చేశారని కొనియాడారు. కష్టకాలంలో వారి కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

సిపిఐ నివాళి

కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని సిపిఐ తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి పేర్కొన్నారు. అఖిల భారత ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ, అనారోగ్యంతో తుది శ్వాస విడవడం చాలా బాధాకరమని పేర్కొన్నారు.

దేశానికి తీరని నష్టం : చింతామోహన్

పేదల పక్షపాతి, మంచి వక్త, పోరాట యోధుడు, గొప్ప మేధావి ఏచూరి మృతి దేశానికి తీరని లోటని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయిలో ఉన్నప్పటికీ అత్యంత సాదాసీదాగా నిరాడంబర జీవితం గడిపేవారన్నారు. దేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను, పరిష్కార మార్గాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారన్నారు.

కార్మిక ఉద్యమానికి తీరని లోటు : టిటిడి ఎస్‌డబ్ల్యుయుఎఫ్

సీతారాం ఏచూరి మృతి దేశానికి, కార్మిక కర్షక ఉద్యమానికి తీరని లోటని గౌరవ అధ్యక్షులు గోల్కొండ వెంకటేశం అన్నారు. ఒకసారి తిరుపతి వచ్చిన సందర్భంగా తిరుమలకు తీసుకెళ్లి ఏచూరి తాతగారు టిబిసి ఏరియాలో యాభై ఏళ్ల క్రితం విరాళంగా ఇచ్చిన కాటేజీని చూపించినట్లు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయడమే నిజమైన నివాళి అని అన్నారు.

'కామ్రేడ్' లాల్‌సలాం : మాజీ ఎంఎల్‌ఎ భూమన

సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో తనకు వ్యక్తిగత పరిచయం ఉందని, రాజకీయాల్లో అత్యున్నత విలువలకు ప్రత్యక్ష ఉదాహరణ ఏచూరి అని మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. 'కామ్రేడ్ మీకు లాల్‌సలాం' అంటూ తన సంతాప సందేశాన్ని 'ప్రజాశక్తి' కార్యాలయానికి పంపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

21 నుంచి చేనేత సొసైటీ ఎన్నికలు

ప్రజాశక్తి- డక్కిలి



చేనేత సహకార సంఘాలకు ఊపిరి పోసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. రానున్న వంద రోజుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఆదేశాలిచ్చింది. ఈ నెల 21 నుంచి ఆ ప్రక్రియ మొదలవుతుంది. డిసెంబరు 6న కొత్త పాలకవర్గాలు కొలువుదీరతాయి. గతంలో యాభై నుండి వందమంది సభ్యులతో సంఘాల రిజిస్ట్రేషన్ చేసేవారు. తాజాగా 30 మందితో కూడా రిజిస్టర్ చేసుకునే వెలుసుబాటు కల్పించింది. ఈ నేపథ్యంలో వెంకటగిరిలో 7 నూతన సంఘాల ఏర్పాటుకు సభ్యులు ముందుకొచ్చారు. ఎన్నికలు పూర్తయితే చేనేత సహకార సంఘాల ద్వారా కార్మికులకు ఉపాధి లభిస్తుంది. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీ నిధులు విడుదలవుతాయి. తిరుపతి జిల్లాలో వెంకటగిరి, డక్కిలి మండలాల్లోని మోపూరు , మర్లగుంట, బాలాయపల్లి మండలం సుబ్రహ్మణ్యం గ్రామాలతోపాటు గూడూరు నియోజకవర్గంలోని చెన్నూరు , శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ప్రాంతాల్లో మొత్తం 51 చేనేత సొసైటీలు ఉన్నాయి. వీటిలో 29 చేనేత సొసైటీలు మాత్రమే క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి.

చేనేతపై చిన్న చూపెందుకు?

ప్రభుత్వాలే చేనేత రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆప్కో చైర్మన్లను ఎందుకు నామినేట్ చేస్తున్నారు? అని చేనేతలు ప్రశ్నిస్తున్నారు. దశాబ్దకాలంగ ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేయడంలో ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. ప్రతి ఐదేళ్లకు ఒక సారి ఎన్నికలు నిర్వహించాలి. ఫెడరల్ విధానానికి ప్రతీకలు ఈ సొసైటీలు. సొసైటీలకు ఎన్నికల నిర్వహించి పాలక వర్గాన్ని, అధ్యక్షులను ఎంపిక చేస్తారు. అలా సొసైటీలకు అధ్యక్షులుగా ఎన్నుకోబడిన వారు ఆయా జిల్లాలకు ఆప్కో డైరెక్టర్ను ఎన్నుకుంటారు. అన్ని జిల్లాల డైరెక్టర్లందరూ కలిసి ఆప్కో చైర్మన్ను ఎన్నుకుంటారు. ప్రతి జిల్లాలోని సొసైటీ అధ్యక్షులు, ఆప్కో డైరెక్టర్ కలిసి ఆప్కో పాలక వర్గంగా ఉంటారు. వీళ్లందరూ కలిసి ఆప్కోను నడిపించాల్సి ఉంటుంది. అయితే పదేళ్లగా ఎన్నికల్లేవు. ప్రభుత్వాలు చైర్మన్లను నామినేట్ చేస్తున్నాయి. తమకు అనుకూలమైన వారికి పదవులు కట్టబెడుతూ సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేస్తున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం గుజ్జల శ్రీనును ఆప్కో చైర్మన్గా చేసింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం చల్లపల్లి మోహన్ రావు, గంజి చిరంజీవని చైర్మన్లుగా నామినేట్ చేశారు. ఎన్నికలు మాత్రం నిర్వహించలేదు.

ఎన్నికలు నిర్వహించడం వల్ల లాభాలు..

చేనేత రంగం పట్ల అవగాహన ఉన్న వాళ్లు, అభివద్ధి చేయాలనే తపన ఉన్న వాళ్లు పాలక వర్గంలోకి వస్తారు. సొసైటీల నుంచే ఎన్నుకోబడిన ఒకరు ఆప్కో డైరెక్టర్ అవుతారు. అందరు డైరెక్టర్లు కలిసి ఒక చైర్మన్ను ఎన్నుకుంటారు. అధ్యక్ష స్థాయి నుంచి చైర్మన్ స్థాయి వరకు చేనేత రంగం పై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న వాళ్లే ఉంటారు. అంటే సొసైటీల్లో సభ్యుడు కూడా ఆప్కో చైర్మన్ కావడానికి చాన్స్ ఉంటుంది. చేనేత రంగం కష్ట నష్టాలు పూర్తి స్థాయిలో తెలుసు కాబట్టి చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉంటుంది.


సొసైటీల ప్రాముఖ్యత ఇది

సహకార సంఘాలు అనేవి చేనేత కార్మికులకు ఒక భరోసా లాంటివి. వీటి వల్ల చేనేత కార్మికులకు ఎన్నో లాభాలు ఉంటాయి. అసంఘటితంగా ఉన్న చేనేతలను సంఘటితం చేసి వారికి నిత్యం పని కల్పిస్తూ, పనికి తగ్గట్టు మజ్జూరీలిస్తూ, వేతనాలిస్తూ, వారికి ఒక భరోసా కల్పించడం కోసం సొసైటీలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వాలు అందించే అన్ని పథకాల ద్వారా లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. ఇలా సొసైటీలకు నేయడం వల్ల వాటికి వచ్చే లాభాల్లో సభ్యులకు వాటా పంచుతారు. ఒక వేళ సహకార సంఘాలు లేకపోతే చేనేత కార్మికులందరూ మాస్టర్ వీవర్ వద్దకు వెళ్లిల్సా ఉంటుంది. మాస్టర్ వీవర్స్ అనే వాళ్లు ప్రధానంగా తమ స్వలాభం చూసుకుంటారు. తమ వద్ద పని చేస్తున్న కార్మికుల కష్టాన్ని చూడరు. అదే మాస్టర్ వీవర్ అయితే తనకు వచ్చే లాభాల్లో వీవర్లకు పంచరు.

పథకాల అమలు సులువు : ఎం.వెంకటేశ్వర్లు, జౌళిశాఖ డెవలప్‌మెంట్ ఆఫీసర్

వచ్చేనెల 21వ తేదీలోపు గుర్తింపు పొందిన సొసైటీలు, నమోదు కానివి, నూతనంగా ఏర్పాటైన వాటి వివరాలను సేకరిస్తాం. ఓటు ఉన్న నేతన్నలంతా ఎన్నికల్లో పాల్గొనేలా చూస్తాం. నవంబరు లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. డిసెంబరు 4న ఎన్నికలుంటాయి. అదేనెల 6న నూతన పాలకవర్గాలు ఏర్పడనున్నాయి. సొసైటీ పాలకవర్గాలు ఏర్పాటయితే పథకాల అమలు, పర్యవేక్షణ సులువవుతుంది.

సొసైటీలు నేతకార్మికులకు దన్ను : పి.చిరాలరెడ్డి, నేత కార్మికుడు, వెంకటగిరి



పాలకవర్గాలు లేకపోవడంతో సంఘాల అభివద్ధి కుంటుపడడమే కాకుండా చేనేత కార్మికులకు సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇప్పటికైనా సొసైటీల ఎన్నికలు నిర్వహిస్తుండడం హర్షనీయం. నేత కార్మికులను నేసిన వస్త్రాలను సొసైటీల ద్వారా కొనుగోలు చేసి వారికి దన్నుగా నిలిస్తే మంచి పరిణామం అవుతుంది.

మట్టిమాఫియా ఆగడాలతో...

మృత్యుపాశాలుగా చెరువులు

ప్రజాశక్తి - ఓజిలి

అక్రమ మట్టి తరలింపుతో చెరువులు మత్యపాశాలుగా మారుతున్నాయి. ప్రకతి సహజసంపదలు కొల్లగొట్టడంతో ప్రజలు పకతి వైపరీత్యాలకు గురవుతున్నారు. ఆహ్లాదకరమైన గ్రామీణ ప్రాంతాల్లో నిండుకుండల్లా ఉండే చెరువులను చూసి ముగ్ధ మనోహరంగా ఆహ్లాదించాల్సిన ప్రజలు నేడు భయభ్రాంతులకు గురికావలసిన పరిస్థితులు నెలకొన్నాయి. కొంతమంది నాయకులు వారి స్వార్థ లావాదేవీల కోసం అక్రమ మట్టి తరలింపుకు పాల్పడుతున్నారు. పచ్చని పొలాలకు నీరు అందించే చెరువులను కొల్లగొట్టి ఎటువంటి అనుమతులు లేకుండా పరిమితికి మించి సాగరమాల రహదారితో పాటు లేఔట్లకు మట్టిని తరలించడంతో లోతైన గుంటలుగా ఏర్పడి చెరువులు భయంకరమైన రూపాన్ని దాలుస్తున్నాయి. వీరి అక్రమాలు ప్రజల పాలిట శాపాలుగా మారుతున్నాయి. చెరువుల్లో మట్టిని తొలగించడంతో వర్షాకాలంలో చెరువు లోతు అంచనా తెలియక పశువుల కాపరులు, వేసవి సెలవుల్లో విద్యార్థులు చెరువులో పడి మత్యుఒడికి చేరుతున్నారు. ఓజిలి మండలంలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. గతంలో మండలంలోని రాజుపాలెం చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మతి చెందారు. పిల్లలతో కలిసి చెరువు వద్ద బట్టలు ఉతుక్కుంటున్న సమయంలో లోతైన గుంట కనపడకపోవడంతో ముగ్గురు చిన్న పిల్లలు నీటి గుంటలో పడి మునిగిపోయారు. పిల్లలను



రక్షించడానికి ప్రయత్నించిన పెద్దనాన్న తోపాటు నలుగురు మతి చెందారు. ఒకే ఇంట్లో నలుగురు మతి చెందిన సంఘటన అప్పట్లో సోషల్ మీడియాలో ,పత్రికల్లో సంచలనం సష్టించింది. మండల కేంద్రానికి చుట్టం చూపుగా వచ్చిన కుర్రాడు కొత్తచెరువు ప్రాంతంలో మలవిసర్జన కోసం వెళ్లి నీటి గుంటలో పడి మతి చెందాడు. గత ఏడాది గ్రద్ధగుంట గ్రామంలో తండ్రి కొడుకు చెరువులోకి దిగి మతి చెందగా కొత్తపేట గ్రామంలో గిరిజన కుటుంబానికి చెందిన తల్లితో సహా ఇద్దరు చిన్నపిల్లలు చెరువులో పడి మతి చెందారు. ఈ మతులన్నిటికీ కారణం చెరువుల్లో అధిక మట్టిని తొలగించడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడి ప్రజలు మత్యువాత పడుతున్నారు. ప్రభుత్వ అనుమతులతో చెరువుల్లో మట్టిని తరలించాలంటే నిబంధనలు ప్రకారం సుమారుగా రెండు లేక మూడు అడుగులు మట్టిని మాత్రమే తొలగించాలి. అది కూడా ఒకే ప్రాంతంలో మట్టిని తొలగించకూడదు. కానీ మండలంలో మట్టి మాఫియా పెట్రేగిపోయి వారి ఇష్టానుసారంగా ఇతర ప్రాంతాలకు తరలించడంతో చెరువుల్లో పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి మూగజీవాలతోపాటు ప్రజల మత్యువాత పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చెరువుల్లో మట్టి తరలింపులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జాతరలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - వెంకటగిరి, డక్కిలి

వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరలో సామాన్యుడికి ఇబ్బందులు తలెత్తకుండా అమ్మవారిని దర్శించుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, డీఎస్పీ వివి రమణయ్య లతో కలిసి పలుశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి జాతర నిర్వహణ ప్రధాన మార్గాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా శ్రద్ధవహించాలన్నారు. అదేవిధంగా అమ్మవారి దర్శనంలో రూ.100, రూ.300లతోపాటు ఉచిత దర్శనం ద్వారా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్యూలైన్లలో వెళ్లే భక్తులకు సాఫీగా అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన మాట్లాడుతూ జాతర సమయంలో ఉన్న సీసీ కెమారలతోపాటు మరో అదనంగా 20 సీసీ కెమెరాలు ఉంచి నిఘా ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్టీసీ అదనంగా 80 బస్సులను కేటాయించాలని తెలిపారు. అంతకమందు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన పోలేరమ్మవారి తల్లిని దర్శించుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులరెడ్డి, సీఐ వివి రమణ పాల్గొన్నారు.



యాజమాన్య పద్ధతులతో మామిడితో అధిక దిగుబడి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే మామిడి రైతులకు అధిక దిగుబడి పొందవచ్చని జిల్లా వనరుల సహాయ వ్యవసాయ సంచాలకులు భాస్కరయ్య తెలిపారు. గురువారం డిఆర్‌సి తరపున మండలంలోని నేషనూరు గ్రామంలో మాజీ ఎంపిపి గంజి మాధవయ్య ఆధ్వర్యంలో రైతు శిక్షణా కార్యక్రమం జరిగింది. మామిడిలో చిగురు వస్తుందని, దాన్ని సంరక్షించుకుంటేనే మూడు నెలల్లో పిందెలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిక ఏడిఏ రమేష్, మండల వ్యవసాయ అధికారి కోదండయ్య, ఉద్యాన అధికారి సౌజన్య పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టు వ్యాపారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'చెవిలో పువ్వు, నుదిటిపై నామాలు ధరించి, చేతిలో శ్రీవారి చిత్రపటంతో' శ్రీవారి మెట్టు వ్యాపారులు వినూత్నంగా నిరసన తెలిపారు. టిటిడి పరిపాలనా భవనం ఎదుట సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర ఆధ్వర్యంలో గత 23 రోజులుగా నిరసన దీక్ష కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, మధు, రామ్మూర్తి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

లాయల్ టెక్స్‌టైల్ చర్చలు రెండోసారి వాయిదా

ప్రజాశక్తి - నాయుడుపేట

మేనకూరు లాయల్ టెక్స్‌టైల్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన చర్చల్లో డిసిఎల్ వెంకటేశ్వరరావు, ఎసిఎల్ సురేష్, నాయుడుపేట మండల ఇన్‌ఛార్జి లేబర్ అధికారి అనీల్, పరిశ్రమల అధికారులతో రెండోసారి చర్చలు జరిగాయి. కార్మికుల తరపున సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, నాయకులు శివకవి ముకుందా, జయచంద్ర, పద్మమ్మ, పుట్టయ్య, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. కార్మికులకు రావాల్సిన నష్టపరిహారంపై మేనేజ్మెంట్ బోర్డు సమావేశంలో మాట్లాడి పరిశీలిస్తామని ఈనెల 18వ తేదీకి వాయిదా వేశారు. ఆరు రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలుపుతున్నా, రెండోసారి చర్చల్లోనూ యాజమాన్యం స్పష్టత ఇవ్వకపోవడం కార్మికులకు ఆగ్రహాన్ని కలిగించింది. ఈసారి జరిగే చర్చల్లో న్యాయం జరగకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు దీప, రత్నమ్మ, గురవయ్య, శివ, సురేష్ పాల్గొన్నారు.

లాయల్ టెక్స్‌టైల్స్‌ను తెరవాలి : సిఐటియు

ప్రజాశక్తి - గూడూరు టౌన్

నాయుడుపేట మండల పరిధిలోని మేనకూరు సెజ్‌లో లాకౌట్ ప్రకటించిన లాయల్ టెక్స్‌టైల్ పరిశ్రమను తెరచి, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని వారికి బాసటగా గూడూరు సిఐటియు నిలిచింది. ఈ మేరకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. 600 మంది కార్మికులు పనిచేస్తున్న పరిశ్రమను ఉన్నపళంగా మూసివేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, సురేష్, చంద్రయ్య, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఓం శ్రీ సాయిరాం వృద్ధాశ్రమంలో మయూరి శ్యామ్ యాదవ్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పది అన్నారు. ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. యువత సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కలుజు కాలువను కాపాడండి

ప్రజాశక్తి-తొట్టంబేడు: మండలంలోని బోనుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న కొడగుంట చెరువు కలుజు కాలువను కాపాడాలంటూ ఆ ఊరి గ్రామస్తులు గురువారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 50అడుగుల విస్తీర్ణం ఉన్న కలుజు కాలువను చెంగయ్య, హరి అనే ఇద్దరు రైతులు ఉద్దేశపూర్వకంగా పూడ్చేసి తమ భూమిలో కలుపుకోవడంతో కలుజు నీరు పారే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఫలి తంగా పక్కనే ఉన్న పొలాలపై ప్రవహిస్తున్న కార ణంగా పంటలను నష్టపోవడం, పంటలను వేయ లేకపోవడం జరుగుతోందని వాపోయారు. ఈ కాలువ గుండా బోనుపల్లి, అంజూరు గ్రామాలను కలుపుకుని సుమారు 300ఎకరాల ఆయకట్టు పారుతోందని.. అసలు కాలువే లేకుండా చేస్తే రైతులకు సాగునీరు ఎలా అందుతుందని ప్రశ్నించారు. అధికారులు స్పందించి కాలువ ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ సుజాతకు వినతి పత్రం అందజేశారు. రైతులు చిట్టిబాబు, శంకరయ్య, జగదీశ్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో బలిజ మహిళ సంక్షేమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ అధ్యక్షురాలు సారంగం సులక్ష్మి మాట్లాడుతూ బలిజ మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులకు సంఘం చేయూతనిస్తుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పద్మావతి, సువర్ణ లక్ష్మి, శ్రావణ లక్ష్మి, అరుణ, రాధ, జానకమ్మ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు అడ్డగింత

- ఉద్యోగిపై మాజీ మున్సిపల్ చైర్మన్ దౌర్జన్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అక్రమ కట్టడాన్ని అడ్డుకున్నందుకు ఓ మున్సిపల్ ఉద్యోగిపై మాజీ మున్సిపల్ చైర్మన్, టిడిపి నేత ముత్యాల పార్థసారథి దౌర్జన్యానికి దిగిన సంఘటన గురువారం సాయంత్రం శ్రీకాళహస్తి పట్టణంలో జరిగింది. వివరాలు.. శ్రీకాళహస్తీశ్వరాలయ నాల్గవ గేటుకు ఎదురుగా ఉన్న సన్నిధి వీధి రోడ్డు స్థలాన్ని ఆక్రమించి అక్రమ కట్టడం కడుతున్నట్లుగా మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన మున్సిపల్ స్థలంలో ఎలాంటి కట్టడాలు చేయరాదని సదరు వ్యక్తిని బుధవారం హెచ్చరించి వచ్చారు. అయినా ఆ వ్యక్తి కమిషనర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా ఆ భవనానికి స్లాబ్ వేసేందుకు సన్నాహాలు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదన గురువారం సాయంత్రం మరోసారి అక్రమ కట్టడం వద్దకు వెళ్లి పనులు ఆపించి వేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో అక్కడే ఉన్న టిడిపి నేత, మాజీ మున్సిపల్ చైర్మన్ టౌన్ ప్లానింగ్ అధికారి మధుసూదనపై దౌర్జన్యానికి దిగారు. 'ఇది నా వార్డు, ఆపేందుకు నీకు ఏం అధికారం ఉంది, నీకు దిక్కున్న చోట చెప్పుకో పో' అంటూ హెచ్చరించారు. అక్రమ కట్టడాన్ని అడ్డుకునేందుకు వెళ్లిన మున్సిపల్ ఉద్యోగిపై మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి దౌర్జన్యం చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.


అక్రమ కట్టడాలు అడ్డుకుంటున్న అధికారులు

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య

- జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ

ప్రజాశక్తి-రామచంద్రాపురం: సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి బాలాజీ అన్నారు. మండలంలోని కుప్పం బాదూరు జెడ్పీ ఉన్నత పాఠాశాలలో సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ కార్యదర్శి ఎస్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని సమకూర్చారు. గురువారం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్యఅతిథిగా డిప్యూటీ డీఈవో బాలాజీ, తహశీల్దార్ వెంకటరమణ, ఎంఈవోలు మార్కొండ నాయుడు, జయవేలు చేతుల మీదుగా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ ముందుకొచ్చి నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, ప్యాట్స్ అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజనా కుమారి, ఉపాధ్యాయులు రవి, వాసు, ఆర్గనైజర్ మునీంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రిని అందిస్తున్న డిప్యూటీ డీఈవో బాలాజీ

సమస్యకు పరిష్కారం ఆత్మహత్య కాదు

- కిమ్స్ న్యూరో సైకాలజిస్ట్ డాక్టర్ హేమలత

ప్రజాశక్తి-క్యాంపస్: వ్యక్తి జీవితంలో సమస్యకు పరిష్కారం ఆత్మహత్య కాదని హైదరాబాద్‌కు చెందిన కిమ్స్ న్యూరో సైకాలజిస్ట్ డాక్టర్ హేమలత అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం క్లినికల్ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆత్మహత్య నివారణ వారోత్సవాల సందర్భంగా గురువారం సావేరి అతిథి గృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ప్రతి సమస్యకు పరిష్కారం అన్వేషించి పరిష్కార మార్గాన్ని కనుగొనాలే తప్ప ఆత్మహత్యకు ప్రేరేపితం కాకూడదన్నారు. ఆత్మహత్యలు చేసుకునే వాళ్ళు పిరికివాళ్లు అని, సమస్యలను ఎదుర్కొని పరిష్కారం చేసుకునేవాళ్లే జీవితంలో సమర్థవంతంగా రాణించగలరని అన్నారు. ప్రతి సమస్యకు పరిష్కారం కచ్చితంగా ఉంటుందనే దానిని వెతుక్కోవడంలో వారి చాతుర్యం తెలివితేటలు ప్రదర్శించాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని మాట్లాడుతూ విద్యార్థినిలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, సమస్యను ఎదుర్కొనే సామర్థ్యం లేనప్పుడు తల్లిదండ్రులకు అధ్యాపకులకు సహాయం తీసుకొని ఎదుర్కోవాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ ఆచార్య కాత్యాయని, సైకాలజీ విద్యార్థినులు, విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తల గోపికి నివాళి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: మండలంలోని అనుపల్లికి చెందిన బత్తల గోపి ఈ నెల 2న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ప్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం విధితమే. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు పులివర్తి వినీల్ గురువారం ఆ గ్రామానికి చేరుకొని కర్మక్రియలకు హాజరైయ్యారు. గోపి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వినీల్ వెంట నాయకులు తిరుమలరెడ్డి, జనార్దన్ చౌదరి, బిందు మాధవి, జగన్, విజయ్ కుమార్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, మహేష్, సిద్దయ్య యాదవ్, వెంకటేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గోపి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చెంచులక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలోని మైక్రో బయాలజీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి కే.చెంచులక్ష్మికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు ఆచార్య ప్రమోద కుమారి పర్యవేక్షణలో "డినేచురేషన్ ఆఫ్ అఫ్లేషన్ బి1 బై ప్రోబయాటిక్ లాక్టోబాసిల్లస్ సలివేరియస్ : ఏ స్టడీ ఆఫ్ హెచ్‌పిఎల్‌సి అండ్ ఎంఎస్ అనాలసిస్" అనే అంశంపై పరిశోధన గ్రంధాన్ని వర్సిటీకి సమర్పించారు. ఇందుకుగా ఆమెకి డాక్టర్ డిగ్రీ ప్రదానం చేసినట్లు వెల్లడించారు. చెంచులక్ష్మి పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లలో అనేక పరిశోధనా వ్యాసాలను ప్రచురించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మండలంలోని గొల్లపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ నెల 14న జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా ముందస్తుగా పోటీలు నిర్వహించినట్లు హెచ్ఎం భారతీ తెలిపారు. విజేతలకు హిందీ భాషా దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. ఉపాధ్యాయులు శ్రీరాములు, చంద్రశేఖర్ నేతృత్వంలో పోటీలు నిర్వహించారు.

సస్య రక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-సత్యవేడు: సస్య రక్షణ చర్యలు చేపట్టడం వల్ల పంటల్లో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని తిరుపతి 'డీఆర్‌సీ' వ్యవసాయ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం సత్యవేడు మండలం వెంకటరాజుల కండ్రిగ రైతు సేవా కేంద్రంలో ఏవో మురళి ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతి (డిఆర్‌సి) వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, చిత్తూరు ఆత్మ వ్యవసాయ అధికారి శశిధర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పంటలో అధిక దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. ప్రధానంగా విత్తనాలు చల్లుకోవడం ద్వారా వరి సాగు చేసిన రైతులు కలుపు యాజమాన్యం సక్రమంగా నిర్వహించాలన్నారు. విత్తనం ఎంపిక, విత్తన శుద్ధి, నారుమడులు ప్రధాన పొలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. సేంద్రీయ వ్యవసాయ విధానాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులు సాగుచేసిన పూల తోటలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, సిబ్బంది స్వర్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేతివృత్తులతోనే మహిళలకు ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి-రామచంద్రాపురం: చేతివృత్తులతోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు అన్నారు. జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో మండలంలోని బ్రాహ్మణ కాలువ పంచాయతీ హరిజనవాడలో పొదుపు సంఘాల మహిళలకు 4నెలల ఉచిత టైలరింగ్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు చేతి వృత్తుల్లో శిక్షణ తీసుకుని కుటుంబాలకు ఆర్థిక రక్షణ కవచంలా ఉండాలని సూచించారు. బ్యాంకు రుణాలను పొంది తద్వారా చిన్న చిన్న యూనిట్లు స్థాపించే స్థాయిలో ఉండాలని అవగాహన కల్పించారు. రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ హరిబాబు మాట్లాడుతూ మహిళలు చేతి వృత్తులు నేర్చుకుని, పొదుపు సంఘాలలో చేరి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ముడి సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది నాగేశ్వరరావు, మునిరాజా, లావణ్య, 75మంది మహిళలు పాల్గొన్నారు.


కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తున్న రాస్ సంస్థ ప్రతినిధులు

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని విఘ్నేశ్వర పురం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీవో మెహబూబీ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం చిన్న పిల్లల తల్లులకు, గర్భవతులకు అవగాహన కలిగించారు. సూపర్ వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ మోహన ప్రియ పాల్గొని గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం కిట్లు అందజేశారు.



గూడూరు: అవగాహన కల్పిస్తున్న సీడీపీవో

తిరుపతి డెస్క్: నారాయణవనంలో మండల స్థాయి పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా సీడీపీవో శోభారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా గర్భవతులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబి, ఎంపిడిఓ కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, మెడికల్ ఆఫీసర్ శ్రీవల్లి, రాగసుధ తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా ఆచార్య హేమ



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలోని ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా ఆచార్య పి.హేమ నియమితులయ్యారు. ఈ మేరకు పరిపాలన భవనం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎస్వీయూలోని ఆర్థిక శాస్త్ర విభాగపు సీనియర్ విశ్రాంత ఆచార్యులు ఆచార్య పి.ప్రసాద్ కుమార్తె ఆచార్య పి.హేమ చిన్నప్పటి నుంచి తండ్రి బాటలో అంచెలంచెలుగా చదువుపై శ్రద్ధతో మహిళలు, బాలికలు ఎవరు తీసుకొని మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్, 2007లో ఎంటెక్, 2014లో పీహెచ్డీ పూర్తి చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎస్వీయూలో జాయిన్ అయ్యారు. డాక్టర్ పి.హేమ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి, అసోసియేట్‌గా విధులు నిర్వహిస్తూ ఆచార్యులుగా ప్రమోషన్ పొందారు. విభాగంలో బిఓఎస్ చైర్పర్సన్‌గా, బాలికల వసతి గృహ వార్డెన్‌గా అనేక పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. ఆమెకు పలువురు అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నేదురుమల్లి



ప్రజాశక్తి-వెంకటగిరి: వైసీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతంపై పలు అంశాల గురించి మాజీ సీఎం దిశానిర్దేశం చేశారని నేదురుమల్లి తెలిపారు.

441వ నేత్రదాత..

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో భాగంగా సూళ్లూరుపేట చాకలి వీధి వాస్తవ్యులు వీరమ్మ (85) మరణానంతరం వారి కార్నియాలను, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో సేకరించి చెన్నై శంకరనేత్రాలయ వారికి గురువారం అందజేశారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో వీరు 441వ నేత్రదాతగా నిలిచారు.

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: గత ఏడాదిలో మిచౌంగ్ తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. గురువారం ఏర్పేడు మండలంలోని కందాడు సచివాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం, జీవో నెంబర్ 22ను చేయాలని, రైతులను ఆత్మహత్యల నుండి కాపాడడానికి రెండు లక్షలు రుణ మాఫీ చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగయ్య, శంకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, కుమార్ స్వామి, వెంకట్రామయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి 'స్వచ్ఛతా హి సేవ'

తిరుపతి టౌన్ : ఈ నెల 14 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య హాజరయ్యారు. గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం, శ్రమదానం ద్వారా చెరువులు, కుంటల వద్ద వ్యర్థ పదార్థాల తొలగింపు చేపట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ర్యాలీ, మారథాన్ రన్, వర్కుషాపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిఎల్‌డీవో సుశీల దేవి, డిప్యూటీ సీఈఓ ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: విజయవాడ, ఉత్తరాంధ్ర వరద బాధితుల కోసం స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విరాళాలు సేకరించారు. గురువారం పట్టణంలోని అనేక ప్రాంతాలలో తిరిగి సేకరించారు. నేరుగా భాధితులకు అందజేస్తామని పాఠశాల యాజమాన్యం ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్ రాజ్, హరికృష్ణ, సింధు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితుల సహాయక చర్యల్లో గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. గురువారం విజయవాడ 43వ డివిజన్‌లో సుమారు రూ.7లక్షలతో ఐదు వేల కుటుంబాలకు చీరలు, టవల్స్, మస్కిటో కాయిల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన సొంత నియోజకవర్గంలోని గూడూరు మండలం నుంచి రూ.2.70లక్షలు, వాకాడు మండల నుంచి రూ.2లక్షలు, చిల్లకూరు మండలం నుంచి రూ.11,500 ఇలా సుమారు రూ.7లక్షల సాయం అందిందన్నారు. కాగా విజయవాడ బాధితులకు అవసరాల మేరకు వస్తువులు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మధుసూదన్ రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, సతీష్ రెడ్డి, హరీష్ నాయుడు, చిరంజీవి, కీరవాణి, అనిల్, పాపాయ్య పాల్గొన్నారు.


బాధితులకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి మృతికి చెవిరెడ్డి లక్ష్మీ నివాళులు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీ ఎంపీటీసీ తాతిరెడ్డి శ్రీరాములు రెడ్డి మృతి ఆ కుటుంబానికే కాదు గ్రామస్తులకు, పార్టీకి తీరనిలోటు అని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ అన్నారు. గురువారం లింగేశ్వర నగర్‌లోని ఆయన ఇంటికి చేరుకుని శ్రీరాములురెడ్డి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

టిసిఎల్ కంపెనీలో మెడికల్ క్యాంపు



ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: తిరుపతి ఈఎస్ఐ ఆధ్వర్యంలో ఏర్పేడు సమీపంలోని టీసీఎల్ కంపెనీలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ వి.గోపీనాథ్, ఎన్.ధనలక్ష్మి, ఆస్టిన్ రాజు, వైద్య సిబ్బంది హేమలత, చిరంజీవి, శ్రీకాంత్, భూపాల్ పాల్గొన్నారు.

కారూరు వద్ద డంపింగ్ యార్డ్ నిర్మించాలి: సిపిఐ

ప్రజాశక్తి-పిచ్చాటూరు: కారూరు గ్రామం వద్ద సబ్వే డంపింగ్ యార్డ్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలు రాస్తారోకో చేపట్టారు. గురువారం తాచుర్ టు చిత్తూర్ ఎక్స్ప్రెస్ హైవేపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ సందర్భంగా సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన తాచుర్ టు చిత్తూరు నేషనల్ ఎక్స్ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతున్న క్రమంలో కారూరు గ్రామం వద్ద హైవేకి అవతల కారూరు గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజల సుమారు 100ఎకరాలకు పైబడిన భూములు ఉన్నాయన్నారు. వర్షాకాలంలో పశువులు, మేకలు, గొర్రెలు, జీవాలు అటువైపునకు వెళ్లడానికి సబ్వే నిర్మించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో వచ్చే చెత్త సేకరణ కోసం డంపింగ్ యార్డు నిర్మించాలని కోరారు. డంపింగ్ యార్డ్ నిర్మాణానికి దశలవారి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అందులో భాగంగా ఈ నెల 16వ తేదీ హైవేపై వంటావార్పు కార్యక్రమం, 22వ తేదీన చిత్తూరు హైవే ఆఫీస్ ముట్టడి కార్యక్రమం చేపడతామని వివరించారు. నాయకులు సుభాష్, అన్నదరై, ముని చంద్ర, రాజా, గురుమూర్తి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



'ఆదిమూలంని రాజకీయ సమాధి చేయడానికే కుట్ర'

- వరదయ్యపాళ్యంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన

ప్రజాశక్తి-వరదయ్యపాళ్యం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఆయనను రాజకీయ సమాధి చేసేందుకు కుట్రలో భాగమేనని దళిత సంఘాల నాయకులు అన్నారు. గురువారం వరదయ్యపాళ్యం మండల కేంద్రంలో మహిళ, దళిత సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదిమూలం అభివృద్ధిపైనే దృష్టి పెట్టేవారని వాపోయారు. అన్యాయంగా మహిళను అడ్డం పెట్టుకొని స్కెచ్ వేసి ఇరికించారని మండిపడ్డారు. ఎమ్మెల్యేపై మోపిన అభియోగాల్లో నిజానిజాలు తేల్చి కుట్ర చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వరదయ్యపాళ్యం ఎస్ఐ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.


ఎస్ఐకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

హెన్రీ భాస్కర్ సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆదర్శ ప్రధానోపాధ్యాయినిగా, ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా, పుత్తూరు పరిసర ప్రాంత ప్రజలకు నిస్వార్థ సేవలు అందించే వ్యక్తిగా హెన్రీ భాస్కర్ అని విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్, వ్యవసాయ శాఖ గుణశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం ఏపీ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనంలో సమస్మరణ సభ సంఘం అధ్యక్షులు భాస్కర్ రాజు అధ్యక్షతన నిర్వహించారు. హేన్రీ భాస్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెన్రీ భాస్కర్ అందించిన విశేష సేవలను కొనియాడారు. విశ్రాంత ఎంఈవో కేశవులు రెడ్డి, యుగంధర్ రాజు, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన

అధికారుల తీరు పట్ల ఆందోళన

ప్రజాశక్తి - వీకోట: మండలం రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా గురువారం వీ కోట మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నాయకుల ఆధ్వర్యంలో బాధితులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డివి.మునిరత్నం, మణి, పార్థసారథి మాట్లాడుతూ పెద్ద బరినేపల్లి రెవెన్యూ పరిధిలోని జంగంగురువేపల్లి గ్రామానికి చెందిన రియాజ్ భార్య ఆరిఫాకు సర్వే నెంబర్112/1ఎ లో ఒక 1. 80 సెంట్లు భూమి సాగులో ఉండగా 0.96 సెంట్లు ఆన్లైన్లో నమోదు చేసి మిగిలిన భూమిని వదిలేసారని తెలిపారు. అదేవిధంగా పరీద్ భాషా భార్య ఫాతిమా బేగంకు చెందిన సర్వే నెంబర్ 113/1డిలో 1 ఎకరా భూమి సాగులో ఉన్నప్పటికీ 0.83 సెంట్లు ఆన్లైన్లో చూపి మిగిలిన 0.17 సెంట్లు భూమిని నమోదు చేయలేదని ఇలా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేయడం వలన అర్హులు భూములు కోల్పోవల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా బసిరుద్దీన్‌కు చెందిన 0.94 సెంట్లు భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేష్ అనుభవిస్తుంటే న్యాయం చేయాలని బాధితుడు కార్యాలయాలు చుట్టూ తిరిగినా స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సంఘం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, సుబ్బమ్మ, వినోద్, మాట్లాడుతూ మండలంలో రైతులు భూములు రీసర్వే చేసినప్పుడు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించి అసలైన లబ్ధిదారుల భూములను వేరే వాళ్ళ పేరుమీద నమోదు చేసి చేతులు దులుపుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి భూములను సర్వే చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సాంబశివ, టి.మునిరత్నం, నాగార్జున, అన్నపూర్ణ, సరస్వతి, భూదేవి, ఆనంద్, బాధితులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి- శాంతిపురం: అనికెర గ్రామ పంచాయతీ పరిధిలో డీప్ శానిటేషన్ డ్రైవ్ కింద జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి కుమార్ గురువారం పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, ముళ్ళ పొదలు తొలగించుట, ట్యాంకులు శుభ్రపరచుట, క్లోరినేషన్, ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ నిర్వహణను పరిశీలించారు. ఈపనులలో సుమారు 20మంది కూలీలు పని చేస్తున్నారని, జెసిబి ద్వారా ముళ్ళ పొదలు, చెత్త దిబ్బలు తొలగింపు పనులు చేపట్టినట్లు తెలిపారు. మురుగు కాలువలకు 350 మీటర్లతో డ్రైన్‌లను నిర్మించాలని, జడ్పీ ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాల్లో లెవలింగ్ పనులు చేపట్టి ప్రహరీ గోడ నిర్మాణంకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓను ప్రజలు కోరారు. గ్రామస్తుల తెలిపిన సమస్యలపై ఎంపిడిఓ స్పందిస్తూ పై అధికారులకు ప్రతిపాదనలు పంపి మంజూరు చేయుటకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.జ్యోతి, ఇంఛార్జ్ విస్తరణాధికారి బిఆర్.రవి నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - శాంతిపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బెంగళూరుకు శంకర్ కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో 145 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 77 మంది కంటి శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. గురువారం జిల్లా వైద్యాధికారిని డాక్టర్ ప్రభావతి దేవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ అర్పిత వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ప్రజలకు అందుతున్న సేవలు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంటి ఆపరేషన్ల కొరకు ఎంపికైన వారికి బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లో నిర్వహిస్తారని శాంతిపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ ప్రసాద్ తెలిపారు.